లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ ఛాంబర్లో లింగ నిర్ధారణ చట్టం డివిజన్ స్థాయి కమిటీ సమావేశం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. స్కానింగ్ సెంటర్లను కమిటీలు ఆకస్మిక తనిఖీలు చేపట్టి ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్లను, రెన్యువల్స్‌ను పరిశీలించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల చట్టవిరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులొస్తే విచారించి రుజువైతే నిర్వాహకులపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ల వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు నేరం, ఇక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు అన్న హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ వి.ప్రసాద్, సిఐ సురేష్ బాబు, లీగల్ ఎక్స్పర్ట్ చల్లా దానయ్య నాయుడు, హెల్త్ ఎడ్యుకేషన్ ఎం.నాగమణి పాల్గొన్నారు.

వైసిపిలో 'ఎంఎల్‌సి' టెన్షన్..!

ఏకగ్రీవం కాకుండా ఫలించిన టిడిపి వ్యూహం
స్వతంత్ర అభ్యర్థులు నలుగురు టిడిపి అనుకూలురే
వైసిపికి అధిక ఓట్లు ఉన్నప్పటికీ లోలోన గుబులు
టిడిపి, జనసేన ఒక్కటిగా ఎత్తుగడలు
క్యాంపు రాజకీయాల వైపు వైసిపి ఆలోచనలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికార వైసిపికి ఎంఎల్‌సి ఎన్నికల టెన్షన్ పట్టుకుంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండు స్థానాలను ఏకగ్రీవంగా సొంతం చేసుకోవాలనే ఎత్తుగడ బెడిసి కొట్టడంతో మంత్రులు, ఎంఎల్ఎలు తలలు పట్టుకుంటున్నారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఏకగ్రీవం కాకుండా టిడిపి వేసిన ఎత్తుగడ ఫలించడంతో ఒక్కసారిగా రాజకీయ పరిస్థితులు మారాయి. రెండు ఎంఎల్‌సి ఎన్నికల స్థానాలకు సంబంధించి ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఇద్దరు వైసిపి, నలుగురు టిడిపి అనుయాయులు. మార్చి 13న ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరగనుంది. జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో ఓటుహక్కు ఉపయోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,105 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో వైసిపి ప్రజాప్రతినిధులు 870 మంది ఉండగా టిడిపి, జనసేన, ఇతరులు కలిపి 235 మంది వరకూ ఉన్న పరిస్థితి నెలకొంది. అత్యధిక ఓటర్లు కలిగిన వైసిపికే రెండు ఎంఎల్‌సి స్థానాలు సొంతం కానున్నాయి. ఎన్నికల పోరు అనివార్యం కావడంతో పరిస్థితులు ఏవిధంగా మారుతాయోననే భయం వైసిపిని వెంటాడుతోంది. టిడిపి ప్రత్యక్షంగా అభ్యర్థులను పోటీలోకి దింపకపోయినా వెనకుండి నడిపిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

అసంతృప్తి కొంప ముంచుతుందా..?

వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో ప్రభుత్వం, పార్టీ తీరుపై సైతం అసంతృప్తి ఉన్నట్లు అంతా అంచనా వేస్తున్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడం, ప్రజాప్రతినిధులకు పెద్దగా గౌరవం లభించకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ అసంతృప్తిని తమవైపు తిప్పుకుని వైసిపిని దెబ్బకొట్టాలని టిడిపి, వైసిపి ఎత్తుగడలు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి, ద్వితీయ ఓట్లు ప్రాధన్యత ప్రాతిపదికన ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవాలంటే 553 వరకూ ఓట్లు రావాల్సి ఉంటుంది. టిడిపి, వైసిపి, ఇతరుల ఓట్లు దాదాపు 235 వరకూ ఉన్నాయి. మరో 320 ఓట్లు సాధించగలిగితే గెలిచే అవకాశం ఉంటుంది. ఒకవేళ కొంతమేర మొదటి ప్రాధాన్యత ఓట్లు తగ్గినా ద్వితీయ ప్రాధాన్యత ఓటు సాధించినా పరిస్థితులు తారుమారవుతాయని అంచనా వేస్తున్నారు. దీనికి తగినట్లుగా ప్రతిపక్ష నాయకులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి సానుభూతిపరులు నలుగురు బరిలో ఉండటంతో ఏవిధంగా ముందుకు సాగుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకరిని మాత్రమే పోటీదారునిగా ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో మేకా శేషుబాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అదే విధమైన వ్యూహాన్ని టిడిపి, జనసేన ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులను తమవైపు తిప్పుకునేవిధంగా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

క్యాంపు రాజకీయాలపై వైసిపి ఆలోచన..?

ఎంఎల్‌సి ఎన్నికలు అనివార్యం కావడంతో వైసిపి క్యాంపు రాజకీయాల వైపు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చెదిరిపోకుండా ముందుగానే సమీకరించి ఒకచోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెబుతున్నారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం, ఓటు ఎలా వేయాలో చెప్పడంతోపాటు ఏఒక్కరూ చెదిరిపోకుండా చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా మారుతున్న పరిస్థితి నెలకొంది. స్వతంత్ర అభ్యర్థులు గెలవకపోయినా ఓట్లు చీల్చగలిగితే వైసిపికి ఎదురుదెబ్బ తగిలినట్లుగానే ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. ఓట్లు చీలకుండా వైసిపి మంత్రులు, ఎంఎల్ఎలు తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నట్లు తెలుస్తోంది.

కేంద్ర బడ్జెట్ మోసపూరితం, ప్రజా వ్యతిరేకం

సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసపూరితం, ప్రజా వ్యతిరేకమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సదస్సు నిర్వహించారు. పుట్టా వేణుగోపాలచౌదరి సదస్సుకు అధ్యక్షత వహించగా ముఖ్యవక్త బలరాం మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశపెడితే ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించారని, దానికి భిన్నంగా మోడీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టాక ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన ద్వారా నష్టపోయిన ఎపికి ప్రత్యేక హోదా లేదని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, కడప ఉక్కు పరిశ్రమ సంగతి మరిచారని, విశాఖపట్నం రైల్వేజోన్ ఇవ్వలేదని, వెనకబడిన ప్రాంతాలకు నిధుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేజోన్ హామీ పక్కన పెట్టారని గుర్తు చేశారు. మోడీ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలిచ్చేలా, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా ఉందన్నారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలు తగ్గించడం అన్యాయమన్నారు. జిల్లా నుండి ఆక్వా ద్వారా రూ.వేల కోట్ల ఆదాయం వస్తున్నా బడ్జెట్లో జిల్లాకు ఎలాంటి నిధులూ కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన అధినాయకులు బడ్జెట్‌పై ఎలాంటి విమర్శలు చేయలేదని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు బడ్జెట్‌లో లేవని వారన్నారు. పట్టణ ప్రాంతాల్లో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పనులు చూపాలనే డిమాండ్ ఉన్నా నిధులు పెంచకపోగా ఉన్న నిధులు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. నూటికి 64 శాతం ప్రజల నుంచి జిఎస్‌టి రూపంలో రూ.లక్షల కోట్లు వసూలు చేస్తున్న ప్రభుత్వం, కార్పొరేట్ల నుంచి కేవలం మూడుశాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుందని విమర్శించారు. క్రోని క్యాపిటలిజం పేరుతో అదానీకి, అంబానీకి దేశ సంపద దోచిపెట్టే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల సేవ మాని ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ నేతలు కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడక రాజు, చిటికిన రాము, జవ్వాది శ్రీను, ధనాల వెంకట్రావు, అల్లం పూర్ణిమ, గొల్లు లక్ష్మి, వర్రి అప్పారావు, సిద్ధిరెడ్డి శేషుబాబు, ధనాల దానయ్య, పోతు శ్రీను, అయినాల ధర్మారావు, అగుర్తుల రామోహనరావు, అయినాల సత్యనారాయణ పాల్గొన్నారు.

శివారు భూములకూ సాగు నీరివ్వాలి

ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తే ఇంజిన్లు సీజ్ - అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తే ఇంజిన్లు సీజ్ చేయాలి, శివారు వరి భూములకు సాగునీరు అందించేలా పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రశాంతి మంగళవారం మండల కేంద్రమైన కాళ్లలో సాగునీటి పరిస్థితిపై సుడిగాలి పర్యటించారు. పంట పొలాలకు సాగునీరు అందించాలని వరి దుబ్బులతో తహశీల్దార్ కార్యాలయం ముందు కాళ్ల రైతులు సోమవారం ధర్నా చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం వరి పొలాల పరిస్థితిని పరిశీలించారు. గత 15 రోజుల నుంచి పంట కాలవలో చుక్కనీరు కూడా రావడం లేదని, నీరు రాక తమ పొలాలన్నీ నెర్రలు తీసి ఎండిపోయాయని పలువురు రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. కెలంక పంటకాలువకు ఆనుకుని ఉన్న ఆక్వా రైతులు విద్యుత్ మోటార్ల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. కాళ్లలో నీటిఎద్దడితో చేలు ఎండిపోతున్నాయని ఇరిగేషన్ ఎఇకి చెప్పినా పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి అధికారులతో మాట్లాడుతూ శివారు పొలాలకు నీటిఎద్దడి రాకుండా వంతుల విధానం ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తున్న విద్యుత్ మోటార్లను అవసరమైతే సీజ్ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఇరిగేషన్ ఎఇ ఫణిశంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరందించేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జలవనరుల శాఖాధికారి పి.నాగార్జున, ఇరిగేషన్ ఇఇ దక్షిణామూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఇలు పిఎన్‌వివిఎస్.మూర్తి, ఎ.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఆర్ఐ రాఘవమూర్తిరాజు, ఎఇ సిహెచ్.జయవాసుకి, రైతులు పాల్గొన్నారు.

ఉండి : చెరుకువాడ సర్పంచితో మాట్లాడుతున్న కలెక్టర్

ఉండి: శివారు ప్రాంతంలోని పంటలకు నీటిఎద్దడి రాకుండా వంతులవారీ విధానం ద్వారా సాగునీరు సక్రమంగా అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చెరుకువాడ గ్రామ శివారు ప్రాంతాలకు నీరందించే కాలువలను, బ్రాంచ్ కాలవలను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి నీరందించడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. ఆక్వా చెరువులకు నీటి మళ్లింపు ఆపితే ఇబ్బంది ఉండదని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా చెరువులకు నీటి మళ్లింపు లేకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఆర్ఐ వి.ఆంజనేయులు, చెరుకువాడ సర్పంచి కొండవీటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు

అంగన్‌వాడీ సిబ్బందితో భోజన ఏర్పాట్లు - పిల్లలకు మరోసారి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తణుకురూరల్

వంటల తయారీని పరిశీలిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్

పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నెం.6లో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు సోమవారం అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే ఘటన జరిగిన వెంటనే మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. మంగళవారం విద్యార్థుల భోజనానికి అసౌకర్యం కలగకుండా అంగన్‌వాడీ సిబ్బందిని నియమించారు. మెనూ ప్రకారం పులిహోర ఇవ్వాల్సి ఉండగా జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని వైట్‌రైస్, బీరకాయ కూర వండిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. పలువురు తల్లిదండ్రులు మాత్రం మంగళవారం తమ పిల్లలను పాఠశాలకు పంపించలేదు. దీనిపై మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీని రద్దు చేయడంతో విద్యార్థుల భోజనానికి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో తాత్కాలికంగా అంగన్‌వాడీ సిబ్బందితో భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం కూడా విద్యార్థులందికీ పరీక్షలు చేయించామని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కొద్ది రోజులపాటు నర్సులను, ఆశా వర్కర్లను నియమించామన్నారు. వారికి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నామని తెలిపారు.

కౌన్సిలర్ మాటే వినకుంటే.. పాలకవర్గం ఎందుకు?

అధికారుల తీరుపై వైసిపి కౌన్సిలర్ పెద్దిరాజు ఆగ్రహం
వాడీవేడీగా ఆకివీడు నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు



అధికారులను నిలదీస్తున్న పాలకపక్ష కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు

ప్రజలకు, ప్రతిపక్షాలకు సమస్యలొస్తే పాలకపక్షాన్ని నిలదీస్తారు.. మరి సమస్యలు పరిష్కరించాల్సిన పాలకపక్ష సభ్యులకే సమస్య ఏర్పడితే తీర్చేదెవరు? వారు ఎవరికి చెప్పుకోవాలి. ఇది ప్రస్తుతం నగర పంచాయతీలో పరిస్థితి. మంగళవారం సాయంకాలం స్థానిక నగర పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం ఛైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. 17వ వార్డు కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు అధికారుల తీరును ఎండగట్టారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే వైసిపి కౌన్సిలర్ పెద్దిరాజు తమ వార్డు పరిధిలో సమస్యలను వివరించారు. ప్రజలు రోజూ తనకు విన్నపాలు ఇస్తున్నారని, కొన్ని సమస్యలు వింటుంటే సిగ్గేసిందని తెలిపారు. తన దగ్గరకు వచ్చి మహిళలు తెలిపిన సమస్యలను ఛైర్ పర్సన్ జామి హైమావతి దృష్టికి తెచ్చానన్నారు. అయితే ఆమె అనారోగ్యంగా ఉండడంతో అధికారులకు తెలిపానని తెలిపారు. అయినా వారిలో చలనం లేదని, కౌన్సిలర్ అడిగినా అధికారులు పనిచేయకపోతే ఇంకా పాలకవర్గం ఎందుకు, సమావేశాలు ఎందుకు అంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా తమ వార్డు పరిధిలోని సమతా నగర్, గంగానమ్మ కోడు ప్రాంతాలు వస్తాయని ఇవి స్లమ్ ఏరియాలో కావడంతో ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. వార్డు పరిధిలో చెత్త ఎత్తే పరిస్థితి లేదన్నారు. ఇదే విషయాన్ని శానిటేషన్ ఇన్‌ఛార్జి ఫణికి ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. ఈ తరహాలో పరిపాలన ఉంటే ప్రజలకు ఏమని సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ తిరుమలరావు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కౌన్సిలర్ పెద్దిరాజు ప్రజల సమస్యల పట్ల స్పందించకపోతే తాను ఎవరినీ లెక్కచేయనని తెలిపారు. కమిషనర్ వివరణ ఇస్తూ ఇప్పటి వరకూ నగర పంచాయతీకి సంబంధించి 20 వార్డుల పరిధిలో ఒక్కరే శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్నారని, మార్చి ఒకటో తేదీ నుంచి శానిటేషన్ ముగ్గురిని నియమించామని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తేవాలని తెలిపారు. దీనిపై ఛైర్ పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ 17వ వార్డులో బుధవారం పర్యటించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీనిపై విపక్ష కౌన్సిలర్లు తమ దాకా వస్తే గాని ఎవరికి తెలియదంటూ దెప్పి పొడిచారు. నాడు అధికార పార్టీ సభ్యులు అధికారులకు వత్తాసు పలికారని, ఇప్పుడు స్వపక్ష పార్టీ కౌన్సిలర్లకు ఈ పరిస్థితి వచ్చిందని చమత్కరించారు.

అధికారుల బెదిరింపులు.. ఆర్థిక ఇబ్బందులు

జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు సతమతం
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్
వంకాయపాలెం లేఅవుట్ పరిశీలన

ప్రజాశక్తి - పాలకోడేరు

'సెంటున్నర స్థలం ఇచ్చారు.. అదీ ఊరికి దూరంగా నివాసయోగ్యం కాని స్థలం.. కనీసం పూడిక చేయలేదు.. ఇల్లు కట్టుకోవాలని.. లేకపోతే స్థలాన్ని వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు' అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఒకపక్క అధికారుల బెదిరింపులు తాళలేక, మరోపక్క ఇళ్లు నిర్మించుకోలేక జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని వంకాయపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌ను మంగళవారం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అనేక సమస్యలను సిపిఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా కనీసం పూడిక చేయకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామానికి దూరంగా నివాసయోగ్యం లేనిచోట లేఅవుట్ ఏర్పాటుచేసి ఇళ్ల స్థలాలు అందజేయడం దారుణమన్నారు. పెన్నాడ, బంటుమిల్లి, శృంగవృక్షం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఈ గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల అనేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఆక్వా చెరువులు, కాలువలు ఉన్నచోట ప్రభుత్వ లేఅవుట్‌ను ఏర్పాటు చేశారని, ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుంటే ఇబ్బందులు ఏర్పడనున్నాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వమే ఇంటిని నిర్మించి అందించాలని, లేనిపక్షంలో రూ.6 లక్షలు ఇంటి నిర్మాణం నిమిత్తం లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, కలిదిండి గోపాలరాజు, సుబ్బారావు, కళ్యాణి, డి.ప్రసాద్, ఆంజనేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక అవసరం

ఐఐటి ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ విఎస్.రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా విద్యాసంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి సంయుక్తంగా కృషి చేయాలని, దీనికి సంబంధించిన సంయుక్త ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రముఖ సివిల్ ఇంజినీర్, ఐఐటి ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ విఎస్.రాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, పోలీస్ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విఎస్.రాజు మాట్లాడుతూ పట్టణంలో శబ్ద, వాయుకాలుష్యం తగ్గించేందుకు విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. దీనికి కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులను ప్రధానంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాలను ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహాయకారిగా నిలపాలన్నారు. అవసరమైనచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో పోలీస్ పోస్టు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అవసరమైన ఆర్థిక సహకారం కొన్ని సంస్థలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి డి.సుబ్బరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి జరిమానా వసూలుకు బదులు వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్ల వాడకం గతం కన్నా 15 శాతానికి పెరిగిందన్నారు. పట్టణ ట్రాఫిక్ సిఐ దాస్ మాట్లాడుతూ పట్టణంలో నోహారన్ వంటి కాలుష్య రహిత సూచనలతో సైన్ బోర్డుల ఏర్పాటు ద్వారా కూడా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, కాలుష్య రహిత పట్టణాలకు సంబంధించి ఎఐసిటిఇ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. దీనికి సంబంధించిన కోర్సులను కళాశాలలో ఏర్పాటు చేసేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్, డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్.శాంతకుమారి మాట్లాడుతూ పట్టణ ట్రాఫిక్ పోలీసులకు తమ కళాశాలలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆర్అండ్‌డిడి డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజుతోపాటు పలువురు వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.

వలస కార్మికుల సమస్యలపై జాయింట్ సమావేశం వేయండి

కలెక్టర్ ప్రశాంతికి సిఐటియు జిల్లా కమిటీ లేఖ

ప్రజాశక్తి - భీమవరం

వలస కార్మికుల సమస్యలపై సంబంధిత అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ కలెక్టర్ పి.ప్రశాంతికి లేఖ రాసింది. ఈ లేఖ ప్రతులను మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ పత్రికలకు విడుదల చేసి మాట్లాడారు. ఇటీవల కలెక్టర్ వలస కార్మికుల సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కొన్ని సూచనలు, నిర్ణయాలు చేయడాన్ని సిఐటియు స్వాగతిస్తుందన్నారు. కరోనా సమయంలో వలస కార్మికుల స్థితిగతులు బాహాటంగా ప్రపంచానికి తెలిశాయని గుర్తు చేశారు. జిల్లాలో బెంగాల్, ఒడిశ్శా, బీహార్, రాజస్తాన్ వంటి రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వచ్చి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటుక బట్టీలు, కోళ్లఫారాలు, ఆక్వా పరిశ్రమలు, రైస్‌మిల్లులు వంటి పరిశ్రమలే కాకుండా వ్యవసాయ రంగంలో కూడా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి పని చేసుకుంటున్నారన్నారు. వీరెవరికీ సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాలు అమలు కాకపోవడం వల్ల వెట్టిచాకిరీతో బానిస బతుకులు గడుపుతున్నారన్నారు. 1979లో వలస కార్మిక చట్టం వచ్చినప్పటికీ దాని అమలులో తీవ్ర లోటుపాట్లు ఉన్నాయన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు అనే ఉత్తర్వులు కూడా ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి సంబంధిత శాఖల అధికారులతో కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలోని ఏడో వార్డు గాంధీనగర్ ఎస్‌టి కాలనీలో మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ యానాది కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మహిళలు బహిర్భూమికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇంతవరకూ మహిళలకు మరుగుదొడ్డి లేకపోవడం దారుణమన్నారు. అలాగే స్థానికంగా కుళాయిలు లేవని గతంలో స్పందనలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్‌రాజు, వీరాస్వామి, యోహాను, ఏసేపు, కుమారి, మరియమ్మ పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీవాసులు

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంట్ర మండలం పోలమూరులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీ సర్పంచ్ కె.రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా డ్రైనేజీ నిర్మాణం కోసం పెద్ద గోతులు తవ్వేసారని, దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లేని పక్షంలో తాత్కాలికంగా తూరలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాఖా సభ్యులు చింతపల్లి తిరుమల, పి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ మూర్తి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

43 మందికి ఉద్యోగావకాశాలు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం 3ఎఫ్ ఇండస్ట్రీలో శిక్షణ పొందిన యువకులకు ఉద్యోగాలు లభించినట్లు 3ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఒపి గోయెంకా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3ఎఫ్ ఇండస్ట్రీస్ వారి రామేశ్వర్ బాలకృష్ణ గోయెంకా ట్రస్ట్ ఆధ్వర్యంలో యువకులకు ఎలైట్ సంస్థ ద్వారా మూడు నెలలు మల్టీ స్కిల్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో 55 మంది యువకులు వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, ఏసి సర్వీసింగ్ విభాగాల్లో ట్రైనింగ్ పొందినట్లు తెలిపారు. వారిలో 43 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని సంస్థ హెచ్ఆర్ జనార్దన్, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను వినియోగించుకోవాలి

పాలకోడేరు: ఫ్యామిలీ ఫిజిషియన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణ నిరంజని తెలిపారు. విస్సాకోడేరులో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి రంగమనాయుడు ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ నిరంజని గ్రామంలో వైద్య సేవలందించి మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు కెవి.నివాస్, పి.నాగమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, లలిత, వాణి, హెల్త్ అసిస్టెంట్లు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గౌతమీలో మెగా జాబ్‌మేళా

పాలకొల్లు: పట్టణంలోని గౌతమీ డిగ్రీ కళాశాలలో కాకినాడ వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మెగా జాబ్ మేళాకు భారీ స్పందన వచ్చింది. 20 కంపెనీలు 1190 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా 4,617 మంది పాల్గొన్నారు. 968 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి గౌతమి కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్, వికాస మేనేజర్ పవన్ నియామక పత్రాలు అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

పాలకోడేరు: విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం, బాల్య వివాహాల అరికట్టడంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించినా, అమ్మినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్, మహిళ పోలీస్ నాగలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై మొగల్తూరులో విచారణ

మొగల్తూరు: మొగల్తూరు వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. కార్యాలయ ఉద్యోగి సుదర్శన్ గతంలో ఇక్కడ పనిచేసిన ఏరియా కోఆర్డినేటర్‌తో కలిసి అవినీతికి పాల్పడ్డారని జగన్నాథపురానికి చెందిన కుక్కల రవిబాబు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ డిపిఎం కె.పార్థసారథి, ఎపిడి కె.అనిత, ఎపిఎం ఎం.సుభాషిని విచారణ చేపట్టారు. తాను ఫిర్యాదు చేసిన అంశాలపై అధికారులు సక్రమంగా విచారణ చేయలేదని జగన్నాథపురానికి చెందిన రవిబాబు ఆరోపించారు.దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఘనంగా కలెక్టర్ కుమార్తె పుట్టినరోజు

భీమవరం : జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కుమార్తె పి.సిరిచందన పుట్టినరోజు వేడుకలు పెదమిరంలోని అరుణోదయ మనోవికాస కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వికలాంగుల సమక్షంలో కేక్‌కట్ చేసి వారికి కలెక్టర్ ప్రశాంతి కేక్ తినిపించారు. అనంతరం కుమార్తె సిరిచందన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి పి.శ్యాంసుందర్, అరుణోదయ మనోవికాస కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

భీమవరం రూరల్ : తల్లిదండ్రులు అనాలోచితంగా నిర్ణయాలు తీసుకుని బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయొద్దని డిఎన్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఎ.అలీమ్ అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కళాశాలలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ అలీమ్ మాట్లాడుతూ బాలికలు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మాగంటి కళ్యాణ మండపం వద్ద ఆత్మబంధువుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ పాల్గొన్నారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులకు, రోగులకు, నర్సింగ్ సిబ్బందికి భోజన వసతి కల్పించారు. గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత డాక్టర్ సుంకవల్లి ప్రమీల రాణి కుటుంబ సభ్యుల సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో టిటిడి ట్రస్టు బోర్డు సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

టైలర్లకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

మొగల్తూరు: మనుషుల అందాన్ని రెట్టింపు చేసే విధంగా దుస్తులు కుట్టేది ఒక దర్జీ మాత్రమేనని బాపూజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొల్లా రాము అన్నారు. మంగళవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హోం చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేసి పేరుపాలెం బీచ్ వద్ద ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పడవల నారాయణ, కోశాధికారి శరబు సూర్యనారాయణ, బొక్కా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట : టైలర్లను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం అన్నారు. కొడమంచిలిలో విలియం హోం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాసరావు, బాబ్జి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టైలర్లకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించాలని టైలర్స్ సంఘం మండల అధ్యక్షులు చిక్క శ్రీనివాస్ అన్నారు. మంగళవారం టైలర్స్ డే సందర్భంగా పెనుమంట్ర మండలం పొలమూరు టైలర్స్ సంఘం తరపున మార్టేరుకు చెందిన చండిపోయిన విష్ణు నాగభూషణం, సత్తారు శీనును సత్కరించారు. కార్యక్రమంలో వినాయక టైలర్స్ అసోసియేషన్ మండలల అధ్యక్షులు చిట్కా శ్రీను, కోశాధికారి ఒత్తుల విజయదుర్గ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ వీరవల్లి గోపి, సెక్రటరీ గుడాల రాంబాబు, టైలర్లు పాల్గొన్నారు.

తణుకురూరల్ : సమాజంలో మానవునికి నాగరికత నేర్పిన ఘనత టైలర్లదేనని వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి కొనియాడారు. వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే సందర్భంగా సంఘం పతాకాన్ని అధ్యక్షులు మల్లేశ్వరపు నాగరాజు ఎగురవేశారు. అనంతరం విలియం హోం విగ్రహానికి సర్పంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడారు. అనంతరం సీనియర్ టైలర్ సానబోయిన నరసింహమూర్తిని సత్కరించారు.

తాడేపల్లిగూడెం : స్థానిక టైలర్ సెంటర్లో టైలర్స్ డే వేడుకలు టైలర్స్ సంఘం పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి (స్వామి టైలర్) , చింతకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యువత ప్రజా ఉద్యమాల వారసత్వాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు, యువత ప్రజా ఉద్యమాల వారసత్వాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్.శర్మ అన్నారు. వల్లూరు గ్రామానికి చెందిన డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు 40వ వర్ధంతి సందర్భంగా మంగళవారం వల్లూరు కలివే సెంటర్లో రామకృష్ణంరాజు స్థూపం వద్ద వర్ధంతి సభ మాజీ డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు, ఇందుకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత రామకృష్ణంరాజు చిత్రపటానికి ఎస్ఎన్ శర్మ, డివైఎఫ్ఐ మాజీ సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో తీవ్ర నిరుద్యోగ సమస్య సృష్టించిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకొచ్చిన మోడీ ప్రభుత్వం అమల్లో ఘోరంగా విఫలమైందన్నారు. ఎంతో మంది అమరవీరుల పోరాట స్ఫూర్తితో డివైఎఫ్ఐ నిరంతరం యువజనుల ఉద్యోగ, ఉపాధి హక్కులపై పోరాడుతున్నారు. రామకృష్ణంరాజు వల్లూరు గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రధాన ప్రజా సమస్యలతోపాటు సమాజహితం కోరుతూ ప్రజాతంత్ర యువజన పోరాటాల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్నారని కొనియాడారు. వల్లూరు నుంచి కొడమంచిలి వరకూ అధ్వాన్నంగా ఉన్న ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించడంలో గ్రామంలోని యువకులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడిన చరిత్ర ఉందని తెలిపారు. వారి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బొర్రా ధర్మారావు, పిల్లి శ్రీరాములు, జోగి సత్యనారాయణ, ఎంపిటిసి తాళం శ్రీనువాస్, కోసూరి సూర్యనారాయణ రాజు, అమలాపురం సత్యన్నారాయణ, ఖండవల్లి నర్సింహామూర్తి, పాతంశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రామకృష్ణంరాజు చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న నేతలు

విద్యార్థుల నైపుణ్యానికి సైన్స్‌ఫెయిర్ దోహదం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆదిత్య ఇంగ్లీషు మీడియం స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు మాట్లాడారు. సివి రామన్ స్ఫూర్తితో విద్యార్థులు నిరంతరం కొత్తకొత్త ప్రయోగాలు చేయాలన్నారు. అనంతరం ఉతమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడారు. ఇటీవల తమ స్కూల్ విద్యార్థి కె.పాల్ సుధాకర్ తయారు చేసిన ఎల్‌పిజి గ్యాస్ లీకేజీ డిక్టర్ ప్రాజెక్ట్ నేషనల్ ఫైనల్స్‌లో ఎంపికవ్వడం సంతోషకరమన్నారు. కార్య క్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కెవి.సత్యనారాయణ, బివై.సుధ, దుర్గాంబ, ఎస్‌కె.బాబా పాల్గొన్నారు. **అలాగే** ఆదర్శ్ నగర్‌లో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉప విద్యాధికారి డి.శ్రీరామ్ ప్రారంభించారు. ఆయన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను చూసి వారిని అభినందించారు. నారాయణ పాఠశాలల ఎజిఎం రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 800 వందల ప్రాజెక్టులు విద్యార్థులు తయారు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణకిషోర్, భీమవరం స్కూల్ ప్రిన్సిపల్ జి.రామకృష్ణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ప్రాజెక్టులు పరిశీలిస్తున్న స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించు కునేందుకు సైన్స్ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని కెజిఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపల్ మెంటే హరనాథ్ బాబు తెలిపారు. కళాశాలలో శ్రీవిజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్, కెజిఆర్ఎల్ కళాశాల ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కోర్సెస్ హెడ్ తోట రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ గంగాధరరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సుమారు 60 అంశాల్లో సైన్స్ ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. 20 మంది శ్రీ భారతి హైస్కూల్, సంస్కార్ స్కూల్, కేజీఆర్ఎల్, జీటిపి కళాశాల సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, జిటిపి కళాశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, సైన్స్ అధ్యాపకులు ఆంజనేయులు, నాచు శ్రీవల్లి, చాయా పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేంద్ర వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ప్రారంభించి సందర్శించారు. ప్రాజెక్టుల తయారీలో కీలక పాత్ర పోషించిన సైన్స్ ఉపాధ్యాయులు ఉంగరాల నాగేశ్వరరావు, పిజె.రాజశేఖర్ బాబు, రాధికను హెచ్‌ఎం వెంకటేశ్వరరావు అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు గాను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకురూరల్ : మనిషి తనకు కావాల్సిన వనరులను నాగరికతను పెంపొందించుకుంటూ చేసే నిరంతర ప్రయత్నమే విజ్ఞానమని రమేష్ చంద్రబాబు అన్నారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో జాతీయ విజ్ఞాన దినోత్సవం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌చంద్రబాబు, కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడారు. అనంతరం రమేష్‌చంద్రబాబును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఎఒ డి.సుబ్బారావు పాల్గొన్నారు.

రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా త్రిపాఠి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ డైరెక్టర్ సుధాకర్‌వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్‌కె ఖాసిం, పి.మునేశ్వరరావు, కెఎస్ఆర్ శంకర్, పి.ప్రేమ్‌కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

పాలకొల్లు రూరల్ : ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌లో ఆసక్తి కలిగేవిధంగా ప్రాజెక్టులు ఏర్పాటు చేశామన్నారు. గతంలోని ఇక్కడ ఏర్పాటుచేసిన సైన్సు ప్రదర్శనలో జాతీయస్థాయిలోనే ఉత్తమ ప్రదర్శనలుగా పేరు తెచ్చుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ వసంత లక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట: సైన్స్ ఫేర్ ద్వారా విద్యార్థుల నైపుణ్యం పెంపొందుతుందని జుత్తిగ హైస్కూల్ హెచ్‌ఎం మణిభారతి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మణిభారతి మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు కె.సత్యనారాయణ, సిహెచ్ వివి.సత్యనారాయణ, ఎం.జయరావు పాల్గొన్నారు.దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్ మాట్లాడారు. సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాలకొల్లు : సైన్స్ డేను పురస్కరించుకొని మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు మాట్లాడారు. విద్యార్థులను, సహకరించిన అధ్యాపక బృందాన్ని స్కూల్ అకడమిక్ డైరెక్టర్ కెవి కృష్ణవర్మ అభినందించారు.

వీరవాసరం : ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో పరిశోధన ఫలితాన్ని రామన్ ధృవపర్చుకున్న రోజును నేషనల్ సైన్స్‌డే గా నిర్వహిస్తున్నట్లు దూసనపూడి ప్రధానోపాధ్యాయుడు ఉదయభాస్కర్ తెలిపారు. సైన్స్‌డేను హైస్కూల్లో నిర్వహించారు. విద్యార్థులు వివిధ సైంటిస్టుల వేషధారణలతో శాస్త్ర సాంకేతి విజ్ఞానాన్ని వివరించారు. విశ్వంలో సైన్స్‌కు, మానవాళిక ఉన్న సంబంధాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు సుదర్శన్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌శాస్త్రి, బిఎంఎస్. కుమార్, వై.విజయకుమార్, భానుమహేష్, నాగశ్రీనివాస్, ఎస్‌కె. సుల్తానా పాల్గొన్నారు.

పోడూరు : గొప్ప శాస్త్రవేత్త సివి.రామన్ అని గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాల గుమ్మలూరు నందు ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ తెలిపారు. సైన్స్ డే సందర్భంగా సివి రామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పీటర్సన్ శాంతాగ్రేస్ పాల్గొన్నారు.

In the Court of the Principal Junior Civil Judge, Rajamahendravaram

O.S. 687/2022

Between:

Gandepudi Leela Bala Ram ...Plaintiff

AND

1. Pusuluri Uday Kishore, S/o. Venkateswara Rao, Employee, D.No. 23A-3-90, Gorakshna Samithi Street, Opp: Dhana Lakshmi Bank, Eluru, W.G.Dist., A.P., Eluru J.C.J. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై దావా మీ హాజరు నిమిత్తం **ది. 20-3-2023 నాటికి వాయిదా అయియున్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥** లగాయితు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరములు పై కోర్టు వారితో మనవి చేసుకోవలెను. లేనియెడల పై గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

ఇంద్రగంటి విశ్వనాథం
వాది తరపు అడ్వకేటు
రాజమహేంద్రవరం సెల్: 9849579614
ది.26-2-2023

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి : వ్యకాస

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల సామాన్య ప్రజానీకానికి, రైతులకు, ఉపాధి కూలీలకు ఎటువంటి ఉపయోగం లేదని, తక్షణం బడ్జెట్‌ను సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. మంగళవారం విస్సాకోడేరులో ఉపాధి కూలీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ చట్టానికి కోతలు విధించిందన్నారు. తక్షణం బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ కార్మికులు, రైతులు, ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గోపాలరాజు, సుబ్బారావు, కళ్యాణి, ప్రసాద్ ఆంజనేయులు ఉన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

Roc. No. TPDG/8/2022/JA (G1)

EXPRESSION OF INTEREST

Eluru Municipal Corporation is proposed to implement the rationalization of Door Numbers for the Town. In this regard it is decided to invite expression of interest (RFP) from the similar experienced Consultants/ Companies to take up the works as per GOMs. No. 102, Dt. 16-03-2004.

Interested Consultants/ Companies to obtain RFP document from Municipal Corporation, Eluru on payment of Rs. 3,000/- in the shape of demand draft on or before 14-03-2023 up to 4.00 P.M and submit the sealed tenders along with required documents before 4.00 P.M on Dt. 16-03-2023.

The Commissioner reserved the rights to accept or reject any or all offers without assigning any reason therefore.

Sd/- **COMMISSIONER,** MUNICIPAL CORPORATION, ELURU

PUBLIC NOTICE FOR CLOSURE OF BRANCH

Dear Stakeholders, Thank You for your trust in Orange Retail Finance India Private Limited (ORFIL) and for choosing ORFIL as your preferred Neighbourhood Financier. We wish to inform that we are closing our below mentioned Branches in Andhra Pradesh for ease of business operations with effect from **31st May 2023.**

1. 1st Floor, Door No.23B/4/61, Subbama Devi School Road, RR Pet, Eluru, West Godhavari, Andhra Pradesh - 534 002.
2. Shop 1&2, 2nd Floor, Skanda shopping Mall, Near Congress Office, Old Chand Talkies, Kurnool, Andhra Pradesh – 518001.
3. 1st Floor, Door No.12-4-23/6&23-7, G.T.Road,Srikakulam, Andhra Pradesh-532001.

All Customer Accounts handled by our Eluru Branch will be automatically transferred to our Vijayawada Branch located at Door No.52-1/1-C, Veternary Colony, Eluru Road, Service Road, Vijayawada, Andhra Pradesh – 520008 and All Customer Accounts handled by our Kurnool Branch will be automatically transferred to our Ananthapur Branch located at 2nd Floor, Door No.14/228, Kamala Nagar, Near Varun Hospital, Ananthapur, Andhra Pradesh– 515 001 and All Customer Accounts handled by our Srikakulam Branch will be automatically transferred to our Visakhapatnam Branch located at 1st Floor, Coastal Heights, Door No.49-24-62, Shankaramatam Road, Visakhapatnam, Andhra Pradesh - 530 016.

In case of any query please reach out to the below-mentioned personnel:-

Name of the Contact Person	Praveen kumar kodandan
Contact No:	97033 33001
Email ID:	praveenkumar.k@orangeretailfinance.com
Branch Address of the Contact Person	1st Floor, Door No. 22-2-11-10-1, Renigunta Road, Tirupathi, Andhra Pradesh- 517501.

All the Terms and Conditions of your loan remains unchanged.

Thank You for choosing Orange Retail Finance India Private Limited as your mobility and livelihood partner.

Registered Office: No. 4/363, 2nd Floor, Kandhanchavadi, Old Mahabalipuram Road, Chennai – 600096. Tel: 9585890000
Email: customercare@orangeretailfinance.com
CIN: U65191TN1989PTC018026

ప్రత్రికా ప్రకటన

In the Court of the 3rd Addl. District & Session Judge, Bhimavaram

O.S. No. 38/2022

Plaintiff: Angara Rambabu

AND

Defendant:
Gamini Raju, S/o. Satyanarayana, R/o. Flat No. R/o. 202, D.No. 22-13-2, 22nd Ward, D.N.R. College Road, Bhimavaram, West Godavari District.

పై నెంబరు దావా వాది ప్రతివాదిపై దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ఎన్ని పర్యాయములు సమన్లు మీకు పంపించినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొని యుండుటలేదు. అనేక పర్యాయములు పోస్టల్ ద్వారా కూడా పంపినను మీరు తీసుకొనుట లేదు. అందువలన మీరు **ది. 09-3-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షంలో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయునది.

వాయిదా తేది: 09-3-2023

P.RAJA RAO
భీమవరం Advocate, Bhimavaram
ది.28-2-23 Cell: 9440130111

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు

ఐ.ఎ. నం. 415/2022, ఐ.ఎ. నం. 416/2022 మరియు ఐ.ఎ. నం. 417/2022
ఒ.యస్. నం. 397/2016

బిట్వీన్:
వీరమల్లు భారతీ జ్యోతి **-పిటీషనరు/వాది**
మరియు
కటికర్ల రామచంద్రరావు వగయిరాలు **-రెస్పాండెంట్లు/ప్రతివాదులు**

పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబర్లు గల 3 పిటీషన్స్‌లో 7వ రెస్పాండెంటు అయిన కటికర్ల రామలక్ష్మి, W/o. లేటు చెంచయ్య, చాకలి బజార్, హైస్కూల్ రోడ్డు, కామవరపుకోట, కామవరపుకోట మండలం, ఏలూరు జిల్లా వారికి **ది. 10-3-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు 3 పిటీషన్స్ తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్స్, అశోక్‌నగర్
ది.28-2-23 ఏలూరు, ఏలూరు జిల్లా

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 96/2022

వాది: నక్కెళ్ళ మాధురి
ప్రతివాద్లు: గాజుల పద్మజ వగైరా
2వ ప్రతివాది అడ్రస్సు:
Gajula Srinivas,
S/o. late Jayaram,
R/o. Flat No. 209,
Sivaki Heights Apartment,
Sanjana Estates,
Gollalakoderu, Palakoderu Mandalam.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాదికి కోర్టు ద్వారా, పోస్టు ద్వారా దావా సమన్లు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 2వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది. 27-3-2023 సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల 2వ ప్రతివాది పరోక్షమున ఈ దావా తీర్మానించబడును.

B.TRIMURTHULU
Advocate, Bhimavaram
Cell: 9484699999

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 1531/2022 in O.S. No. 96/2022

పిటిషనరు/వాది: నక్కెళ్ళ మాధురి
రెస్పాండెంట్లు/ప్రతివాద్లు: గాజుల పద్మజ వగైరా
2వ రెస్పాండెంట్ అడ్రస్సు:
Gajula Srinivas, S/o. late Jayaram,
R/o. Flat No. 209,
Sivaki Heights Apartment,
Sanjana Estates,
Gollalakoderu, Palakoderu Mandalam.

పై నెంబరు పిటిషనులో 2వ రెస్పాండెంట్‌కి కోర్టు ద్వారా, పోస్టు ద్వారా నోటీసులు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 2వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది. 27-3-2023 సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల 2వ రెస్పాండెంట్ పరోక్షమున ఈ పిటిషను తీర్మానించబడును.

B.TRIMURTHULU
Advocate, Bhimavaram
Cell: 9484699999

ఒరిజినల్ వీలునామా డాక్యుమెంట్ పోయినది

ఉందుర్తి సువర్ణమ్మ, భర్త: చిన్నారావు గారి ఒరిజినల్ వీలునామా డాక్యుమెంట్ నెంబర్ 132/1990 గల వీలునామా పోయినది. గ్రామం: తణుకు పట్టణం, వార్డ్ 6, బ్లాక్: 20, ఇంటి నం: 15-20-16, సర్వే నెం: 137/1ఏ, ఉత్తరం సరిహద్దులో ఉంది, మునిసిపల్ రోడ్ 25.6 అడుగులు. దక్షిణం: మున్సిపల్ 25.6 అడుగులు. తూర్పు: ఉండ్రాజవరపు రామస్వామి 27 అడుగులు. పడమర: కారుమంచి నరసయ్య & అంతర్వేది 27 అడుగులు. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు అందించగలరు.

పార్టీ వివరములు:
ఉందుర్తి ప్రసన్నకుమార్, తండ్రి: చిన్నారావు, 6వ వార్డు, డోర్ నెం. 15-20-16, పాత ఊరు తణుకు, పశ్చిమగోదావరి జిల్లా.

యు.బి.రాజేంద్రప్రసాద్, అడ్వకేట్
తణుకు బార్ అసోసియేషన్,
తణుకు, సెల్: 9502355878

ప్రకటన

నా క్లయింటు పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు నగరం, శనివారపుపేట గ్రామ కాపురస్తులైన **నడిగంట్ల సత్యనారాయణ (లేటు) గారి కుమారుడు నడిగంట్ల సూర్యనారాయణ అలియాస్ ఆంజనేయులు గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా-

నా క్లయింటు నడిగంట్ల సూర్యనారాయణ గారు, నడిగంట్ల ఆంజనేయులు అని కూడా పిలువబడుచున్నారు. సదరు రెండు పేర్లు నా క్లయింటునకు చెందినవని తెలియజేయుచున్నాను. మరియు సదరు (లేటు) నడిగంట్ల సత్యనారాయణ గారికి నా క్లయింటు అనగా నడిగంట్ల సూర్యనారాయణ గారు రెండవ కుమారుడై ఉన్నారు. మరియు మొదటి కుమారుడు నడిగంట్ల శ్రీనివాసరావు అయి ఉన్నాడు. నా క్లయింటు డి.సి.బి. బ్యాంక్ లిమిటెడ్, ఏలూరు బ్రాంచ్ నందు తనకు చెందిన జాయింటు ఆస్తి డాక్యుమెంట్ నెం. 1280/2000, తేది. 26-02-2000ని సదరు బ్యాంకునకు కుదువపెట్టి లోను తీసుకొనుచున్నాడు. సదరు నా క్లయింటు పేరు విషయంలో గాని, సదరు ఆస్తి తాకట్టు విషయంలో గాని ఎవరికైనను ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల ఏడు (7) రోజులలోగా నాకు లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో తెలియజేయగలరు. అట్లు కానిచో, నా క్లయింటు యథావిధిగా సదరు బ్యాంకు నుండి లోను పొందగలడు. తదుపరి వచ్చిన క్లయిములు నా క్లయింటును బైండ్ ఓవర్ చేయజాలవు.

కె.వి.పి.మాధవరావు, అడ్వకేట్ & నోటరీ
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్
స్థలం: ఏలూరు ఏలూరు కోర్టు సెంటర్
తేది:28-02-2033 సెల్: 9440111033

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు, డోర్ నెం.9-10రు కాపురస్తురాలు నరికిమిల్లి సత్యనారాయణగారి భార్య నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి వయస్సు 54 సం॥లు పై అడ్రస్‌లో నివాసముంటున్న నేను ది.15-2-2017వ తేదీన దబ్బాడ వెంకటమ్మ గారి వలన పెదపాడు మండలం, ఏపూరు గ్రామ రీ.స. 242-4 రు దాఖలా చ.గ. 193.6 ల నివేశన స్థలము, అందుగల డోర్ నెం.9-11 ఆర్.సి.సి. భవనము వగైరాల సహా కొనుగోలు చేసుకొని నా పేరున శ్రీ వట్లూరు స.రి.లో ద.నెం. 273/2017 రుగా రిజిష్ట్రీ పొంది అట్టి ఆస్తి నేటి వరకు నా స్వాధీన హక్కుభుక్తములలో వుండియున్నది. నా దస్తావేజుకు లింకు దస్తావేజు నెం. 3349/2010 రును, అట్టి దస్తావేజుకు లింకు దస్తావేజు నెం.7957/2006రు మరియు, సదరు నెం. 7857/ 2006రుకు లింకు దస్తావేజు 836రుగా నాకు అందజేయటం జరిగియున్నది. అట్టి 7957/2006, 836రుగా గల లింకు దస్తావేజులను ది. 11-02-2023వ తేదీన నా బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకొని నూజివీడులో లాయరుగారి వద్దకు వెళ్ళుచుండగా మీర్జాపురం దాటిన తర్వాత ట్యాంక్ కవర్‌లో పెట్టుకొన్న కవర్ దస్తావేజు ఎక్కడో జారిపోయినట్లు గమనించి నేను వెంటనే వెనుకకు తిరిగి నేను వచ్చిన మార్గములో రోడ్డుకు ఇరువైపులా వెతికినాను, అటుగా వస్తున్న వారిని అడిగిననూ ఎంత వెతికిననూ దొరికి యుండలేదు. అప్పటి నుండి ఎంత వెతికిననూ నా యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజు కనిపించలేదు. కావున సదరు ఒరిజినల్ రెండు లింకు దస్తావేజులు నెం. 7957/2006, 836 ఎవరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుతున్నాను.

ఇట్లు
నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి,
భర్త : నరికిమిల్లి సత్యనారాయణ, డోర్ నెం.9-10రు
బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు,
బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా,

మహారాజశ్రీ ఏలూరు 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు

ఇ.పి. నెం.421/2020 ఇన్ ఎ.ఆర్.సి. నెం.24/2020

Between :
మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, తాడేపల్లి గూడెం - డి.హెచ్.ఆర్
మరియు
తన్నేడి నాగ వెంకట మణికుమార్ మరియు ఇతరులు - జె.డి.ఆర్స్

యిందు పై నెంబరు ఇ.పి. గ్రంథములో ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలం ది.16.03.2023వ తేదీన ఉదయం గం.10.30ని॥లకు పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. పబ్లికేషన్ ద్వారా తెలియపరచడమైనది.

షెడ్యూలు

West Godavari District, Tadepalligudem Sub-District, Tadepalligudem Mandal, Padala Village accounts, R.S. No.23/2 out of total extent Ac.0.35 cents southern side an extent of Ac.0.17 1/2 cents in which South-West Corner an extent of 182.0 sq. yds. or 151.0 sq. mtrs. of site together with RCC building bearing Assessment No.23 is measured and bounded by : East : Site of P. Satyanarayana 36.9 ft., West : Road 42.0 ft., North : Site of P. Appa Rao 44.0 ft., South : House of Maddukuri Ratna Rao 39.3 ft. Total extent in the above boundaries 182.0 sq. yds. is equivalent to 151.0 sq. mtrs. with all easementary rights over the schedule property.

DHR Value : Rs.20,00,000/-
Amin Value : Rs.17,00,000/-

Place : Eluru Date : 28.02.2023

MUNTA SATISH, Advocate, Eluru.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 472/2022 in O.S. No. 48/2012

పిటిషనర్లు:
వీరవల్లి నరశింహులు (వాది) and 4 others
రెస్పాండెంట్లు:
వీరవల్లి జానకిరామారావు and others
6వ రెస్పాండెంటు:
వీరవల్లి నాగేశ్వరరావు, S/o. late విశ్వనాథం, వయస్సు 30 సం॥లు, C/o. బత్తాయితోట, తుని, తుని మండలం, తూ॥గో॥జిల్లా T.JCJC.
7వ రెస్పాండెంటు:
వీరవల్లి దుర్గారావు, S/o. late విశ్వనాథం, వయస్సు 28 సం॥లు, Near: పెద్దింట్లమ్మ గుడి, డోరు నెం. 13-65, బంటుమిల్లి, పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు I.A. 472/2022 లో 6, 7 రెస్పాండెంట్లకు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికీన్నీ సదరు 6, 7 రెస్పాండెంట్లు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోకుండా Avoid చేయుచున్నారు. కావున సదరు 6, 7 రెస్పాండెంట్లు **ది. 09-3-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల సదరు 6, 7 రెస్పాండెంటుల పరోక్షమందు సదరు పై నెంబరు I.A. తీర్మానించబడును.

K.SOMA SEKHARA PRASAD
భీమవరం Advocate, Bhimavaram
ది.24-2-2023 Cell: 9848777584